నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి స్థితిదానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర గ్రంథాలయాన్ని కాపాడుకుందాం

గ్రంథాలయ పరిరక్షణ కమిటీ, ప్రజాసంఘాల ధర్నా

జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రంథాలయ పరిరక్షణ కమిటీ, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలను విరమించకోవాలని, లేకుంటే ప్రజల మద్దతుతో పోరాటం కొనసాగిస్తామని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించాలని, గ్రంథాలయ ఆస్తులను అభివృద్ధి పేరుతో అన్యాక్రాంతం చేయొద్దని డిమాండ్ చేస్తూ గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కరణం బుచ్చి సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి తమరి వైకుంఠరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు విద్యార్థులకు పోటీ పరీక్షల సన్నద్ధమయ్యేందుకు, పరిశోధనలకు, సాహిత్య అధ్యయనానికి నిలయంగా ఉన్న కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత నిరుద్యోగులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజానీకంతో పాటు అన్ని వర్గాలపై ఉందన్నారు. కేంద్ర గ్రంథాలయాన్ని అభివృద్ధి పేరుతో ప్రైవేటీకరణ చేయవద్దని గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చిన గ్రంథాలయ పరిరక్షణ కమిటీ నాయకులను జైల్లో పెడతామని కలెక్టర్ హెచ్చరించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రతిపాదన అభివృద్ధి నిరోధకమైందని అభిప్రాయపడ్డారు. ఇది గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తికే విఘాతం కలిగిస్తుందన్నారు. గ్రంథాలయంలో విజ్ఞాన సముపార్జన ప్రక్రియకు ఇది ఆటంకం కలిగిస్తుందన్నారు. బయట రీడింగ్ రూములలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించి చదువుకోలేని నిరుద్యోగ యువతకు ఈ గ్రంథాలయం ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రంథాలయాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఉన్న భవనాలను పడగొట్టి కొత్తగా నాలుగు ఫ్లోర్‌లు నిర్మించి, ఒకటి గ్రంథాలయానికి కేటాయించి, మిగిలిన మూడు ఫ్లోర్‌లను ప్రైవేట్ వారికి అప్పగిస్తామని చెప్పడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ధర్నాలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జెవివి సమత కో-కన్వీనర్ టి.ఎర్రమ్మ, బిఎస్ఎన్ఎల్ ఇయు నాయకులు ఎం.గోవర్ధనరావు, రిటైర్డ్ లేబర్ కమిషనర్ పి.వెంకటరావు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు, ఐలు నాయకులు వై.చలపతిరావు, పోస్టల్ యూనియన్ నాయకులు కె.గణపతి, జనసాహితీ నాయకులు పి.మోహనరావు, బెఫీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు బి.సూర్యారావు, సిఐటియు నాయకులు ఆర్.ప్రకాశరావు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి మండలంలోని రావివలస, దామోదరపురం, చిన్ననారాయణపురంలో రూ.11.28 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశామని, ఈనెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేదసిందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు కష్టాలు పడ్డారన్నారు. గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్కలి అభివృద్ధిలో భాగంగా కోనేరు రక్షణ గోడ, రివిటింగ్ వర్క్స్, పర్యాటక సదుపాయాల ఏర్పాటు వంటి కీలక పనులు చేపట్టనున్నారు. అభివృద్ధి ప్రణాళికను ఆర్‌డిఒ కృష్ణమూర్తి మ్యాప్ ఆధారంగా వివరించారు. సందర్శకులకు కొత్త అనుభూతి కలిగించేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పంచాయతీరాజ్ అధికారి ఎం.సుధాకర్, ఆర్ అండ్ బి అధికారి రవికాంత్, వంశధార ఇఇ రాజశేఖర్, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు ఊరట

ఎట్టకేలకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు ఊరట లభించింది. ఎనిమిది వారాలకు సంబంధించి కూలి డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. జిల్లాలో 4.28 లక్షల జాబ్‌కార్డుల్లో 7.31 లక్షల మంది కూలీలు సభ్యులుగా ఉన్నారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఫిబ్రవరి నుంచి కూలి డబ్బులు చెల్లించడం లేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.176.85 కోట్లు మంజూరు చేసింది. దీంతో మే పదో తేదీ వరకు ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లింపులు చేసింది. చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనిచేస్తున్న శ్రామికులందరికీ మే పదో తేదీ వరకు పూర్తిగా చెల్లించినట్లు పేర్కొన్నారు. మిగిలిన బకాయిలనూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే, ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చెల్లిస్తామని స్పష్టం చేశారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మడ్డువలస కాలువ పనులకు ప్రణాళికలు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు, జి.సిగడాం మండలాల సరిహద్దులోని మడ్డువలస కాలువ పనులను తిరిగి ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు అన్నారు. ప్రాజెక్టు ఫేస్-2లో సాంకేతిక అంశాలు, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సమస్యల వల్ల సగం వరకు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును తిరిగి చురుగ్గా ముందుకు తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మదుపాం, బొట్లపేట, వాంద్రంగి ప్రాంతాల్లో రైతులతో కలిసి కాలువను ఆదివారం పరిశీలించారు. మదుపాం పంచాయతీ వద్ద, బొట్లపేట ఆర్ అండ్ బి రోడ్డులో, వాంద్రంగిలో కల్వర్టు నిర్మాణం పూర్తయితే ధవళపేట, అబోతులపేట, వాంద్రంగి గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు, అధికారులు వివరించారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

పళ్ల తోటల పథకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వర్గాల చిన్న, సన్నకారు రైతులు (ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన వారు) పళ్ల తోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్షాధారిత పళ్ల తోటల పెంపకం పథకం కింద జిల్లాలో 22 రకాల మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జీడి, నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, చింత, సీతాఫలం, దానిమ్మ, అత్తి, బేరు, బటర్ ఫ్రూట్, జాక్ ఫ్రూట్, డ్రాగన్ ఫ్రూట్, మునగ, స్వీట్ ఆరెంజ్, ఆయిల్‌పామ్, కోకో, పూలతోటలుగా రోజ్, జాస్మిన్ వంటి పంటలకు గోతుల తవ్వకం, మొక్కల కొనుగోలు, నీరు పోయడం సహా నిర్వహణ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. పంట రకాన్ని బట్టి ఎకరానికి రెండేళ్ల నుంచి మూడేళ్లలో రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు ఖర్చును భరించనున్నట్లు తెలిపారు. గతేడాది జిల్లాలో 1,650 ఎకరాల్లో వర్షాధారిత ఉద్యాన పంటల పెంపకం చేపట్టగా, ఈ ఏడాది లక్ష్యాన్ని మూడు వేల ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. జాబ్‌కార్డు కలిగిన అర్హులైన రైతులు సంబంధిత మండల కార్యాలయాల్లోని ఎంపిడిఒ, ఎపిఒలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో కూడా వివరాలు పొందుపరచి పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, స్థిర ఆదాయ మార్గాన్ని ఏర్పరుచుకోవాలని పేర్కొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

● వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ ● ఏడాది వైఫల్యాలపై పుస్తక ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో ఏడాది పాలనలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫమైందని, పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం టిడిపి ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం రూ.15 వేలు కుటుంబంలో అందరి పిల్లలకూ అందజేస్తామని హామీనిచ్చారని అన్నారు. ఇప్పుడు రూ.2 వేలు కోత విధించారని అన్నారు. కఠినతరమైన నిబంధనలతో చాలా మందికి ఈ పథకం అందలేదని అన్నారు. 2024-25 విద్యా సంత్సరానికి అందజేశారా? అంటూ ప్రశించారు. మత్స్యకారుల సేవలో పథకం సైతం మొదటి ఏడాది అమలు చేయలేదని గెలిపారు. నిరుద్యోగ భృతి, 50 ఏళ్లు దాటిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు పింఛన్లు, 20 లక్షలు ఉద్యోగాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం ఎన్నికలు ముందు అమలు చేస్తారా? అంటూ ప్రశించారు. బూటకపు హామీలతో అధికారంలోకి రావటం, వచ్చిన తరువాత హామీలు విస్మరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు చింతాడ రవికుమార్, మామిడి శ్రీకాంత్, కిల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఉత్తర

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. జి.సిగడాం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 25 ఏళ్లుగా వంట ఏజెన్సీలు నిర్వహణ చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు మారినా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు గానీ, ఉద్యోగ భద్రత గానీ లేదని విమర్శించారు. కొన్నేళ్లుగా కార్మికులకు వేతనాల పెంపుదల ఊసే లేదన్నారు. ఇస్తున్న అతి తక్కువ వేతనాలూ సక్రమంగా ఇస్తున్న పరిస్థితి లేదన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నందున ప్రభుత్వం ఇస్తున్న మెనూ ఛార్జీలు చాలా తక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో కార్మికులు అప్పులపాలవుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాథమిక పాఠశాలకు రూ.20, ఉన్నత పాఠశాలకు రూ.30 మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. వంట నిర్వాహకులు పాఠశాలలో ఆరు గంటల సమయం పనిచేస్తున్నారని, ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం సరిపోవడం లేదన్నారు. కనీస గౌరవ వేతనం రూ.పది వేలకు పెంచాలని, 9, 10 తరగతి పిల్లల హాజరును బట్టి గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాగి మాల్టు ఇచ్చి ఐదు నెలలవుతున్నా, ఇప్పటివరకు మెస్ ఛార్జీలు చెల్లించలేదని చెప్పారు. వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. వంట నిర్వాహకులపై రాజకీయ ఒత్తిళ్లు, తొలగింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో సాగుకు యత్నం

అడ్డుకున్న రైతులు, దళితులు

జెసిబిని అడ్డుకున్న రైతులు, దళితులు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అన్నంపేటలో రైతులు, దళితుల సాగులో ఉన్న 25 ఎకరాల భూములను అదే గ్రామానికి చెందిన పెత్తందారుడు యంత్రాలతో దున్నేందుకు యత్నించగా రైతులు, దళితులు ఆదివారం అడ్డుకున్నారు. తమ సాగులో ఉన్న భూమిని ఎలా దున్నుతారని రైతులు, దళితులు ప్రశ్నించారు. భూములకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు తన వద్ద ఉన్నాయని, భూములకు హక్కుదారు తానేనని పెత్తందారుడు బదులివ్వడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. 80 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న భూములను దౌర్జన్యంగా సాగు చేస్తే ఊరుకునేది లేదని రైతులు, దళితులు స్పష్టం చేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి భూముల్లోకి ప్రవేశిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతులు, దళితుల ప్రతిఘటనతో పెత్తందారుడు యంత్రాలతో సహా వెనుదిరిగి వెళ్లిపోవడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. సమస్య పరిష్కారం విషయంలో రెవెన్యూ అధికారులు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని రైతులు, దళితులు విమర్శించారు. ఇదే సమస్యలపై గతంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు గుర్తుచేశారు. 80 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గొడవలకు దూరంగా ఉండాలి

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గొడవలు, నేరాలకు దూరంగా ఉండాలని రౌడీషీటర్లు, నేర చరిత్ర ఉన్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వారికి, పాత నేరస్తులు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరంగా మరింత కఠిన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ ఎల్లప్పుడు గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతుందన్నారు. నేర ప్రవృత్తి విడనాడాలన్నారు.

ఆరోపణలు నిరూపించాలి

● లేకుంటే అప్పలరాజు క్షమాపణ చెప్పాలి ● ఎమ్మెల్యే గౌతు శిరీష

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన భర్తపై చేసిన ఆరోపణలు ఆధారాలతో సహా నిరూపించాలని, లేకుంటే తన కార్యాలయం వద్దకు వచ్చి గుండు కొట్టించుకొని చెప్పుతో కొట్టుకొని క్షమాపణలు కోరాలని ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అప్పలరాజు ప్రశ్నలకు తాను సమాధానం చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఓటు వేసిన ప్రజలకు సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. తన భర్తపై చేసిన నిరాధారణ ఆరోపణలు, వ్యాఖ్యలు నీ విజ్ఞతకే విడిచిపెడుతున్నామన్నారు. కేవలం తెల్లరేషన్ కార్డు ఉన్న మాజీ మంత్రి నగరం నడిఒడ్డున ఉన్న రాజా లాడ్జి భవనాన్ని రూ.12 కోట్లకు ఏ విధంగా కొనుగోలు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బొడ్డపాడు ఎంఐజి లేఅవుట్ స్థలాల కొనుగోలులో 12 శాతం ముందస్తు కమిషన్ రైతుల వద్ద కొట్టిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తమ యువనేత బడ్డ నాగరాజు ఇంటిముందు ఉన్న రోడ్డును విరగొట్టడానికి 400 మంది పోలీసులతో కాపలాకాయించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయలేదా? అని ప్రశ్నించారు. చివరకు యువ నాయకుడిని హత్య చేయించడానికి కూడా వెనుకాడలేదని అన్నారు. చివరకు యువ నాయకుడిని హత్య చేయించడానికి కూడా వెనుకాడలేదని, హంతకులకు బెయిల్ ఇచ్చి రౌడీలను పెంచి పోషిస్తున్నారని ఉదహరించారు. తన తాత సర్దార్ గౌతు లచ్చన్నపై విషప్రచారం చేస్తే... ఆయన విగ్రహాలు రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకున్నారన్నారు.

ఏడాదిలోనే అభివృద్ధి

తాను అధికారంలోకి రాగానే వంశధార ద్వారా సాగునీరు అందించామన్నారు. ఆఫ్‌షోర్‌కు రూ.110 కోట్లు నిధులు విడుదల చేయించామన్నారు. కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ యూనిట్లు, రూ.110 కోట్లతో ఇంటింటా తాగునీటి పథకం, కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు అనుమతులు, పూడిలంక వారధికి అనుమతులు తీసుకువచ్చామని అన్నారు. తాను చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని తెలిపారు. కేవలం ప్రజల ఆదరాభిమానాలతో ఏడాదిలోనే భారీస్థాయిలో నిధులు తీసుకువచ్చామని చెప్పారు. మరో నాలుగేళ్లలో పలాస జిల్లాలో ఒక ప్రముఖ కేంద్రంగా మారుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శివారు భూములకు సాగునీరు

● గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు
● వంశధార ప్రాజెక్టు ఎస్ఇ స్వర్ణకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శివారు భూములకు సాగు నీరందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వంశధార ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఇ స్వర్ణకుమార్ చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వంశధార కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక పూర్తి స్థాయిలో తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చూస్తున్నామన్నారు. తద్వారా శివారు భూముల రైతుల వెతలు తీరనున్నాయని తెలిపారు. కాలువ గట్లు పటిష్ట పరచడం, బ్రీచ్‌లను పూడ్చడం వంటి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు గత ఏడాది కాలంగా ఊపందుకున్నాయని చెప్పారు. ఖరీఫ్‌లో సాగునీటి సమస్యల పరిష్కారం, ప్రాజెక్టు పనుల స్థితిగతులపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

వంశధార కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా శివారు భూముల వరకు సాగు నీరందుతుంది. ఇందు కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.5.84 కోట్లతో 151 రకాల పనులు చేపడుతున్నాం. ఇందులో రూ.కోటి విలువైన 58 పనులు ప్రగతిలో ఉన్నాయి. జూన్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

? ఖరీఫ్ నేపథ్యంలో ఎటువంటి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు? పనుల పరిస్థితి వివరించగలరు?

వంశధార కాలువ గట్లను పటిష్ట పరచడం, బ్రీచ్‌లను పూడ్చడం వంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రూ.4.10 కోట్ల విలువైన 117 రకాల పనులను చేపడుతున్నాం. అందులో రూ.3.80 కోట్ల విలువైన 113 రకాల పనులు ప్రగతిలో ఉన్నాయి.

? వంశధార కాలువలపై ఉన్న షట్లరు పాడయిపోవడంతో నీటి నియంత్రణ, శివారు భూములకు నీరందకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని ఎలా అధిగమిస్తారు?

జిల్లాలో షట్టర్ల సమస్య అయితే ఉంది. 2009లో షట్టర్ల అవినీతిపై సిఐడి కేసు నమోదు చేయడం, అవి కోర్టు పరిధిలో ఉండటంతో అపరిష్కృతంగా ఉంది. దీనివల్ల కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేక పాత వాటితోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం.

? ఎంజిఎన్ఆర్‌జిఎ కింద ఎన్ని రకాల పనులు చేపడుతున్నారు? పనుల ప్రగతి వివరించగలరు?

ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ) రూ.18.26 కోట్ల విలువైన 82 రకాల పనులకు అనుమతి లభించింది. వాటిలో రూ.11.18 కోట్ల విలువైన 51 పనులు ప్రగతిలో ఉన్నాయి.

? హిరమండలం రిజర్వాయరు ఎత్తిపోతల పథకం పనులు ఎంత వరకు వచ్చాయి? ఎప్పటిలోగా పూర్తవుతుందని భావిస్తున్నారు?

హిరమండలం రిజర్వాయరు ఎత్తిపోతల పథకాన్ని రూ.175.35 కోట్లతో ప్రారంభించడం జరిగింది. ఇప్పటివరకు 45 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తవుతుందని ఆశిస్తున్నాం.

? వంశధార స్టేజ్-2 ఫేజ్-2 ప్రాజెక్టు పనులకు నిధులు కొరత ఏమైనా ఉందా? ఎప్పటిలోగా పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు?

వంశధార స్టేజ్-2 ఫేజ్-2 ప్రాజెక్టు పనులకు ఎటువంటి నిధులు కొరత లేదు. ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.182.53 కోట్లు కేటాయించింది. ఇందులో గత ఏడాది కాలంలో రూ.56 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఇప్పటివరకు 93 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టు సిద్ధమవుతుంది.

? ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనుల ప్రగతిని వివరించగలరు?

ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు ఇప్పటివరకు 45 శాతం పనులు అయ్యాయి. బడ్జెట్‌లో రిజర్వాయరుకు రూ.90.60 కోట్లను కేటాయించింది. రిజర్వాయరు పనులు 2027, జూన్ నాటికి పూర్తవతాయి.

? వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు ఎంత వరకు వచ్చాయి? పనుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా?

వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు ఇప్పటివరకు 73 శాతం పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ ఆసక్తి చూపకపోవడంతో ఒప్పందం రద్దు చేసుకోవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన లు పంపాం. సవరించిన అంచనాలతో వ్యయప్రతిపాదనలూ పంపిస్తున్నాం.

ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా సాగాలి

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలో ఆధునీకరించిన కిమ్స్ ఆస్పత్రిని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కిమ్స్‌లో అధునాతన వైద్యసేవలు అందించడం జిల్లాకు గర్వకారణమన్నారు. అత్యున్నత వైద్య సేవల కోసం విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కిమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ కేన్సర్, గుండెపోటు వంటి రోగాలకు అధునాతన వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, కిమ్స్ డైరెక్టర్ ఎన్.సాయిబాబు, డాక్టర్ సుధీర్, డాక్టర్ పిజె నాయుడు, ఓఎం రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అధికారుల తీరుపై విప్ ఆగ్రహం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో 20 వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి గ్రామస్తులు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలు విన్న విప్ మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. వార్డులో ఇప్పటి వరకు విద్యుత్ స్తంభాలు వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా... ఇంకా వార్డులో కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై మండిపడ్డారు. వార్డులో కాలువలు, రోడ్లు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కి ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో పీతాంబర్ రెడ్డి, పార్వతి, హరిప్రసాద్ రెడ్డి, రాకేష్, బుడ్డెమ్మ, లక్ష్మి, ఎంఎస్‌ఎయ్య, విమల, గోపాల్ పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ శివశంకర్

కాకినాడ ఆదిత్య ప్రిన్సిపాల్‌కు పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులో భారతీయ విద్యా భవనంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవంలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్‌కు ఉత్తమ రక్త ప్రేరకుడి విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అరుదైన గౌరవం లభించింది. పురస్కార వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన పురస్కారాన్ని అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. పురస్కార గ్రహీతకు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, సెక్రెటరీ ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బిఈవిఎల్ నాయుడు, కళాశాల డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. 50 మంది సభ్యులు హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా కొత్తకోట పోలినాయుడు, అధ్యక్షులుగా విఎస్ఎస్ కేశవరావు, జనరల్ సెక్రటరీగా కూన తవిటి నాయుడు, కోశాధికారిగా టి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా విఎస్ఎస్ ప్రసాద్, ఎంఎ ఖబ్బు, ఎస్ సత్యనారాయణ రాజు, సెక్రెటరీలుగా ఎస్ వెంకన్న, కె.శివయ్య, సభ్యులుగా పి.కామేశ్వరరావు, టి.వి.ప్రసాదరావు, ఆర్ వి రమణ పట్నాయక్, ఎన్ ప్రభాకరరావు, పి.చక్రపాణి, పి.తవిటి నాయుడు, బి.శ్రీరామమూర్తి, ఆర్.విటల్ మోహన్, ఎం.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన సతీష్

ప్రజాశక్తి- కవిటి

కవిటికి చెందిన మొగిలిపురి సతీష్ రాష్ట్రస్థాయి నడకపోటీలో మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాడు. గుంటూరులో నిర్వహించిన అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా 20 కి.మీ. నడక పోటీల్లో సతీష్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఉషోదయ యువజన సంఘం సభ్యులు, స్థానిక క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..!

- బురదమయంగా రహదారులు
- పట్టించుకోని అధికారులు

రణస్థలం : కురిసిన వర్షానికి బురదమయమైన రహదారి

ప్రజాశక్తి- రణస్థలం

ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేయక పోవడం, ఇటీవల కురిసిన వర్షాలకు మండల, గ్రామ రహదారులైతే మరీ అధ్వానంగా తయార య్యాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. రాత్రివేళల్లో సరిగా కనిపించక గుంతల్లో పడి వాహనదారులు ప్రమా దాల బారినపడుతున్నారు. మండలంలోని తెప్పలవలస పంచాయతీలో సీతారాంపురం నుంచి మీసాలబడి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలు పడి ప్రయాణి ంచడానికి వీలులేకుండా తయారైంది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరుచేరి బురదతో ఎక్కడ గుంతలు న్నాయో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలీని పరిస్థితి. దీంతో పలువురు వాహన దారులు గుంతలో పడి గాయాలైన సంఘటనలూ లేకపోలేదు.. వాహనాల్లో ప్రయాణం సరికదా.. కనీసం నడవడానికి కూడా ఈ రోడ్డు ఇబ్బందిగా ఉంది. దీంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కనీసం గ్రామస్తులు నడిచివెల్లే పరిస్థితి కూడా లేదు. వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి ప్రయాణమే నరకప్రాయంగా తయార య్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి గ్రామస్తుల సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రణస్థలం : గోతులమయమైన రహదారి

సమస్యను పరిష్కరించాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీళ్ల నిలిచిపోయి ఎక్కడ చూసినా గుంతల్లో నీరు చేరి ప్రయాణిం చాలంటే ఎక్కడ గుంత ఉందో తెలీక ప్రజలు భయ పడు తున్నారు. ఈ రోడ్డుపై స్థానికులు ప్రయాణం సాగించాలంటే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇక నడిచి వెళ్లాలంటే అసలు వీలు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈరోడ్డుకి తక్షణమే మరమ్మతులు చేపట్టి రోడ్డు బాగు చేయించాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నందిగాం : గోతులమయమైన రోడ్డు

అధ్వానంగా రోడ్డు

నందిగాం: మండలం నరేంద్రపురం కూడలి నుంచి వల్లభరాయుడుపేట వరకు గల రహదారి పూర్తిగా గోతుల మయమైంది. దీంతో ఈ ప్రాంతీయులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దారి పొడవునా గోతులమయమై వర్షం పడిందంటే చెరువులను తలపిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదానికి గురి అవుతామోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ రహదారికి మోక్షం కలిగించాలని పలువురు కోరుతున్నారు.

రహదారి ఎప్పుడు పూర్తవుతుందో !

ఆమదాలవలస : మండలంలోని దివాంజిపేట మీదుగా సైలాడ వరకు అలికాం – బత్తిలి రోడ్డును కలిపే సిసి రహదారి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా అలికాం బత్తిలి ప్రధాన రహదారి నుంచి 6/6 కిలోమీటర్లు రూ.160 లక్షల నిధులతో దివాంజిపేట మీదగా సైలాడ వరకు సిసి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019 శాసనసభ ఎన్నికల దృష్ట్యా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ రహదారి పనులు కొనసాగు తాయని ప్రజలు ఆశించారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. వైసిపి ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఇప్పుడు 2024 ఎన్నికల అనంతరం టిడిపి మళ్లీ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడుస్తున్నా రహదారి పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం పడినా ఈ రహదారులు చెరువులుగా మారిపోతుండటంతో గ్రామానికి ఎలా చేరుకోవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని ప్రజలు వాపోతున్నారు. ఒక్కోసారి వర్షాలు కురిసేటప్పుడు దివాంజిపేట సైలాడ గ్రామాల ప్రజలు రామచంద్రాపురం లేదా జొన్నవలస మార్గంగా మీదుగా అదనంగా 4–5 కిలోమీటర్లు ప్రయాణించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే ఎమ్మెల్యే రవికుమార్ స్పందించి రహదారి పనులు పున్నప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రావెల్ వేసి నిలిచిపోయిన సిసి రహదారి

చినుకు పడితే చెరువులా మారుతున్న రహదారి

రోడ్డు బాగయ్యేదెప్పుడు..?

మెళియాపుట్టి: మండలంలోని శివారు ప్రాంతమైన గొప్పిలి, రంపకాన మధ్య ఆర్అండ్‌బి రహదారి అధ్వానంగా మారింది. రోడ్డునిండా ఎక్కడపడితే అక్కడ అడుగులోతు గుంతలు ఏర్పడి ప్రయా ణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు రంపకాన నుంచి లొత్తూరు రిజర్వాయర్ వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా మారింది. అధికారులు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రహదారులు మరమ్మతులపై దృష్టి సారిస్తున్నారు తప్ప. దూరపు ప్రాంతాల్లోని రహదారుల మరమ్మతులపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు రోడ్డు దుస్థితిపై ఆవేదన చెందుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న గొప్పిలి ఆర్అండ్‌బి రహదారి

వ్యవసాయాధికారిగా ఉషారాణి

ప్రజాశక్తి- బూర్జ

ఉషారాణి

మండల వ్యవసాయ శాఖ అధికారిగా దుంపల ఉషారాణి బాధ్యతలను చేపట్టారు. మండల వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహించిన ఎన్.శ్రీనివాసరావు టెక్కలి మండలానికి బదిలీపై వెళ్లారు. శ్రీకాకుళంలో మట్టి నమూనా సేకరణ కార్యాలయంలో ఎఒగా పనిచేసిన ఉషారాణి బూర్జ మండల వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. రైతుల సమస్యలపై కృషి చేస్తానని, రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

చీరల పంపిణీ

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలసలో ఫాదర్స్ డే సందర్భంగా గ్రామానికి చెందిన విశాఖపట్నం హెచ్‌పిసిఎల్ సీనియర్ మేనేజర్ గుడివాడ వెంకట మాధవ్ సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో గ్రామంలో కొంతమంది మహిళలకు చీరలను, పెద్దలకు స్వీట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రుల ఆదరణకు చిన్న గౌరవప్రద సమర్పణ అని అన్నారు. తండ్రుల ఆదరణ ఆప్యాయత మరువలేనిదని, వారి త్యాగాల ఫలితమే నేటి మన ఉన్నతికి కారణమన్నారు. గ్రామానికి చెందిన తొత్తడి వైకుంఠరావు, బెవర రాజారావు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

టెక్కలి : సమాజంలో వృద్ధులపై నిర్లక్ష్యం తగదని, వారిని గౌరవించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కోర్టు సముదాయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులను వారి పిల్లలు నిరాదరన చేస్తే పిల్లలపై కోర్టులో భరణం కేసు వేయవచ్చునని తెలిపారు. వృద్ధుల హక్కులపై అవగాహన అవసరమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ పట్నాయక్, ప్యానల్ న్యాయవాది పి.మధుబాబు, ప్రదాన హరిశ్చంద్రరావు, బొడ్డ అయ్యబాబు, దవళ కృష్ణారావు, సత్తారు రాంబాబు, అనిశెట్టి చిట్టెన్న పాల్గొన్నారు.

పలాస : వృద్ధులపై ప్రేమాభిమానాలు చూపాలని పలాస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి యు.మాధురి అన్నారు. మండలంలోని కోసంగిపురంలో లలితా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన వయో వృద్ధులు, మానసిక రోగులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ట్రస్టులో ఉన్న సభ్యులందరికీ తమ సంస్థ ద్వారా ఆధార్ కార్డు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.కె.ఆర్.పట్నాయక్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మన్మథరావు, ఎపిజి పిండి వెంకటరావు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, న్యాయవాదులు కె.లోకేష్, కె.దేవరాజ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సంతాపం

ఇచ్ఛాపురం : ఇటీవల అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘోర విమాన ప్రమాదం మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆదివారం స్థానిక బస్టాండ్ కూడలి నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జెసిఐ సంస్థ అధ్యక్షులు కాళ్ల జయదేవ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కళాకారులు

మార్క్సిజమే శ్రీశ్రీ సాహిత్యానికి మూలం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కళాకారులు శ్రీశ్రీ భావజాలాన్ని ముందుకు కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు నెయ్యల చంద్రయ్య అన్నారు. మండలంలోని నగరంపల్లిలో ఎన్.మోహనరావు అధ్యక్షతన ఆదివారం శ్రీశ్రీ 42వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు పేరును శ్రీశ్రీగా తెలుగు సాహితీ రంఘంలో ప్రముఖ వ్యక్తిగా వెలుగొందారని కొనియాడారు. ఆయన నమ్ముకున్న మార్క్సిజమే ఆయన సాహిత్యానికి మూలమని అన్నారు. ఆయన సినీ రంగంకు రాసిన పాటల్లోనూ శ్రామిక వర్గ దృక్పథం ఉట్టి పడుతుందని వివరించారు. ఆయన రాసిన కవితలు, పాటలు సమాజ ప్రేరణకు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. ఈయన సాహిత్యం దోపిడీని అంతమొందించే వరకు ఒక ఆయుధంలా పనిచేస్తుందన్నారు. శ్రీశ్రీ రాసిన అనేక పుస్తకాల్లో మహాప్రస్థానం, మరోప్రస్తానం, ఖడ్గం, సిరిసరి మువ్వలు ఈ పుస్తకాలు ప్రతి సాహితీ కళాకారులు యువతరం అధ్యానం చేయాలని కోరారు. మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం మతతత్వం, మతోన్మాదం, మూఢత్వం పెంచే సాహిత్యంపై తిరుగుబాటు జరగాలంటే శ్రీశ్రీ సాహిత్యం ఎంతో అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో షర్ట్ ఫిల్మ్ డైరెక్టర్ కిల్లి సునీల్, బి.ఆనందరావు, ఈశ్వరమ్మ, నిర్మల, గౌరమ్మ, కాంతమ్మ, కె.పార్వతి, కోలాటం కళాకారులు వైష్ణవి, త్రివేణి, సంజన, సునీత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ గాయత్రి నగర్‌లో శ్రీశ్రీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కవి బి.సుబ్బారావు, వేదిక గౌరవాధ్యక్షులు, జర్నలిస్టు వంకల రాజారావు, జానపద కళాకారులు కుమార్ నాయక్, వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి, సోమలయ్య, బి.సాంబమూర్తి, తెప్పల కృష్ణమూర్తి, వంకల రాజారావు, ఎం.నాగేశ్వరరావు, బి.సాంబమూర్తి పాల్గొన్నారు. బి.కాళిదాసు విప్లవ గేయాన్ని ఆలపించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నబాడాంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఎన్ఎన్ ఎలివన్స్ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన వేణు ఎలివెన్స్ జట్టుకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు ద్వారా మానసికోల్లాసం, ఆరోగ్యం వంటి ఎన్నో ఉపయోగాలు ఉ న్నాయన్నారు. ప్రతిఒక్క క్రీడాకారుడూ గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఓటమే భవిష్యత్‌లో గెలుపునకు పునాది అని గుర్తించాలన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి వెళ్లిన వారికి ప్రభుత్వం గుర్తించి వారికి ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, మలిపెద్ది నరేంద్ర, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, క్రికెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని తొత్తిడిపుట్టుగకు చెందిన పాడియా పురుషోత్తం కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకున్నాడు. ఇద్దరు పాపలతో ఓవైపు కుటుంబ పోషణ, మరోవైపు మందులకు డబ్బులు లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పురుషోత్తంతో పదో తరగతి చదివిన స్నేహితులు, ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ కలిసి అతనికి అండగా నిలిచాయి. ఆదివారం గ్రామానికి చేరుకున్న ఇరువురు పురుషోత్తంకు తక్షణ సహాయంగా రూ.27 వేలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓవైపు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పురుషోత్తంకు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పురుషోత్తం స్నేహితులు, ఎస్‌జిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. పొల్లాడకు చెందిన మార్పు కృష్ణవేణికి కాలు తొలగించారు. భర్త చనిపోవడంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె పరిస్థితి తెలుసుకుని సంస్థ తరుపున ఆదివారం ఆమెకు రూ.10 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చింత మోహన్, చింత దానేష్, మండల మహేష్, పాపారావు, మాగుబరి కుమారస్వామి, చందు, కోళ్ల కృష్ణారావు, కొంకి మోహిని, సుంకర రాణి, బాలక సౌదామని, గనగళ్ల ఉమ, చింత రోహిణి, దివ్య పాల్గొన్నారు.

సోంపేట : పట్టణంలోని చిన్నకోమటి వీధికి చెందిన అర్చకుడు వేణు పాణిగ్రాహి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఒరియా బ్రాహ్మణ అర్చక సంఘం సభ్యులు ఆదివారం వేణు పాణిగ్రాహి కుటుంబ సభ్యులకు రూ.51 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో షణ్ముఖ పాణిగ్రాహి, సింహాచల పాడి, గోపాల్, రమేష్ కుమార్, రఘునాథ్, దేవేంద్రనాథ్, అశోక్‌రావు, మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

జగదీష్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎర్రముక్కాం కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పొట్టి జగదీష్ శనివారం అర్ధరాత్రి టెక్కలి సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలు పాలై ఆదివారం మృతి చెందాడు. జగదీష్ ఇచ్ఛాపురం రూరల్ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబు ల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శిక్షణ నిమిత్తం విజయ నగరం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా టెక్కలి సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తీరంగ గాయాల పాలైన జగదీష్‌ను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స నిర్వహించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, బిటెక్ చదువు తున్న కుమారుడు ఉన్నారు. జగదీష్ మృతితో ఎర్రముక్కం, ఇచ్ఛాపురం రూరల్ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సోమవారం ఎర్ర ముక్కంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడు తెలిపారు.

వ్యక్తికి రెండున్నరేళ్ల జైలుశిక్ష

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వ్యాపారి కాళ్ల శ్రీనివాసరావుకు నకిలీ పెయింట్స్ కేసులో రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ... మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారని టౌన్ ఎస్ఐ ముకుందరావు ఆదివారం తెలిపారు. ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2017లో నమోదైందన్నారు. చీటింగ్ కేసులో ఇచ్ఛాపురానికి కాళ్ల శ్రీనివాసరావు అనే వర్తకుడు ఏషియన్ పెయింట్స్ కంపెనీకి చెందిన పెయింటింగ్ డబ్బాలను నకిలీవి తయారు చేసి అమ్ముతూ పట్టుబడ్డారని తెలిపారు.

'బోయిన' సోదరులకు మాతృవియోగం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రేమకుమారి (ఫైల్)

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, వైశ్య కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు మాతృమూర్తి ప్రేమ కుమారి (95) ఆదివారం తన నివాస గృహం కోటబొమ్మాళిలో మృతి చెందారు. ఈమె కుమారులు బోయిన రమేష్ కోటబొమ్మాళి టిడిపి మండల అధ్యక్షులుగా ఉన్నారు. బద్రీనాథ్ లండన్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డారు. విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన బయలుదేరారు. మరో కుమారుడు గోపాల్ స్థానికంగా వ్యాపార రీత్యా స్థిరపడ్డారు. మరో కుమారుడు సత్యానంద్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి. మరో కుమారుడు మన్మథరావు బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుమార్తె అలివేలు మంగమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర పౌర విమానయానశాఖమంత్రి కింజరాపు రామమోహన్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు అంత్యక్రియలు మంగళవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సోంపేటలో పోలీసుల తనిఖీలు

సోంపేట : సోంపేటలో పలు దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద అక్రమ మద్యం, గంజాయి కోసం స్థానిక పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ లవరాజు ఆధ్వర్యాన పోలీసు జాగిలాలతో కిరణా షాపులను, షాపింగ్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకు ంటున్నామన్నారు.

ఘనంగా గణేష్ వార్షికోత్సవం

నందిగాం : మండలంలో గణేష్ కాలనీలో గల వరసిద్ది వినాయక ఆలయం ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూర్తి గణేష్ కాలనీవాసుల ఆధ్వర్యాన పూజారీ రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్ శర్మలు పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వైద్యశిబిరాలకు స్పందన

పొందూరు : వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బురిడి కంచరాంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వండాన మురళీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం మెడకవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 250 మంది, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారుగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్ వైద్యులు, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి, డాక్టర్ రిషి, సత్యం యువసేన కమిటీ సభ్యులు, మెడికవర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం ధర్మవరం పంచాయతీ పరిధిలో సేవా కార్యక్రమాల్లో భాగంగా సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, ప్రజా వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, ఫిజికల్ హీలింగ్ డాక్టర్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది రోగులకు పాల్గొనగా రక్తపరీక్షలు, ఇసిజి తీసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రిలో ప్రతి శనివారం ఉచితంగా ఒపి చూడబడునని, పేదలకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్యామల రావు, బగ్గు రాజారావు, ఎంపిటిసి రుప్ప రమేష్, అల్లు కన్నబాబు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని మెట్టూరు పంచాయతీ తోటపల్లిలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యాన శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు విజృంభిస్తున్నాయని, ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఉద్దానం ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు స్వాతి, రిషి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఇసిజి, బిపి, సుగర్ వైద్య పరీక్షలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయ్ కుమార్, సభ్యులు సైని శాంతి, వంక జోగారావు, కృష్ణారావు, డి.చంద్రశేఖర్, తామాడ ఢిల్లేశ్వరరావు, టి.పవన్, తామాడ చైతన్య, తామాడ తిరుపతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సరుబుజ్జిలి: మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు ఆధ్వర్యంలో సరుబుజ్జిలి మండలంలోని రొట్ట వలసలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పాల్, డాక్టర్ హరిత ఈ వైద్య శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల్లో ఏడుగురికి కేన్సర్ సంబంధిత లక్షణాలను గుర్తించారు. వీరికి విశాఖపట్నం రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.స్వప్న రోగులకు అవసరమైన వివిధ రకాల మందులు పంపిణీ చేయగా మాజీ ఎంపిటిసి తాడేల వెంకటరమణ వైద్య శిబిరం ఏర్పాటుతో పాటు రోగులకు తాగునీరు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యసిబ్బంది, టిడిపి నాయకులు టి.వైకుంఠరావు, బెవర రాజారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు సురేష్

ఆ మలుపులు ప్రమాదానికి పిలుపులు

చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

పాత నిమ్మతొర్లాడ వద్ద రహదారి మలుపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న కొన్ని మలుపులు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ఈ మలుపులు ట్రాఫిక్‌కు కారణమవుతూ తరచుగా రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. వివరాలలోకి వెళ్తే మండలంలోని పాత నిమ్మతొర్లాడ జొన్నవలస గెడ్డ వద్ద మలుపులు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో కొంతమంది వ్యక్తులు మత్యువాతకు గురవుతున్నారు. స్థానికుల వివరాల మేరకు సరిగా సంకేత బోర్డులు లేకపోవడం, తగినట్లుగా రోడ్డు విస్తరణ లేకపోవడం అలాగే వాహనదారుల వేగం నియంత్రణలో లేకపోవడమే ఈ మలుపులు వద్ద ప్రమాదాలకు ప్రధాన కారణాలని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రదేశాల్లో వీధి దీపాలు లేక చీకటిగా ఉండడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు, రోడ్లు భవనాల శాఖ, రవాణాశాఖ అధికారులు

పాతూరు వద్ద ప్రమాదాలకు నిలయమైన మలుపులు

ఈ విషయాన్ని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెదురు చెట్లతో జరభద్రం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని మదనాపురం నుంచి సరుబుజ్జిలి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వెదురు చెట్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న వెదురు చెట్లు గాలివీచే సమయంలో పూర్తిగా రోడ్డుపైకి వంగుతుండంతో వాహనదారులకు తగలడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మదనాపురం నుంచి సరుబుజ్జిలి వాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా వెదురు కర్ర తగలడంతో ప్రమాదం సంభవించి మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నాయి. మదనాపురం నుంచి సరుబుజ్జిలి రహదారికి ఇరువైపులో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నా... అవి పెనుగాలు లకు వంగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులతో పాటు గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారిపై వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, వ్యాన్‌లు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ప్రమాదాల నివారణ కొరకు తొలగించాలని వాహనదారులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ చాపర సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ మెంబర్‌గా ఎంపిక చేసినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ యూనివర్సిటీ స్థాపనకు దివంగత సిఎం ఎన్‌టిఆర్ ఎంతో కృషి చేసారన్నారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్య ఇచ్చారని, పేదలందరికీ ఉచిత వైద్యం అందించేలా పనిచేశారని గుర్తు చేశారు. అదే బాటలో సిఎం చంద్రబాబు నియోజవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఎంపిక చేసిన పదవికి తగు న్యాయం చేస్తూ వైద్య విద్య అభివృద్ధికి, మెడికల్ కాలేజీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్‌ను టిడిపి నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో టిడిపి నాయకులు బి.రమణమూర్తి, కూన అంజనేయులు, బోర గోవిందరావు, గురయ్య, పివిఎన్ రాజు, చౌదాల గోవిందరావు, ఇంజరాపు విశ్వనాథం పాల్గొన్నారు.

సుధాకర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పంట ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉందని అలాగే వాటికి మార్కెట్లో అధిక ధర కూడా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో క్షేత్ర పర్యటనలో భాగంగా డిపియం మాట్లాడుతూ రైతులు విత్తనం నాటిన నుంచి చివరి కోత దశ వరకు ఏ విధమైన రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించే రైతుల పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించే రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ప్రతివారం మండల కేంద్రాల వద్ద ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న ప్రొడక్ట్‌ను తమ సిబ్బంది ద్వారా విక్రయించి ప్రకృతి వ్యవసాయ రైతులకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులందరూ పంటలను పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న డిపిఎం సత్యనారాయణ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974 -75 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. యాభైఏళ్ల తర్వాత వీరంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. వీరిలో దాదాపు అందరూ ఉద్యోగ విరమణ చేసినవారే కావడం గమనార్హం. వీరంతా వేదికపైకి వచ్చి తమను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఇంజనీర్ సందుల రామకృష్ణ, విశ్రాంత డిఎంహెచ్ఒ సనపల తిరుపతిరావు, బండారు నాగమణి తదితరులు ఆధ్వర్యం వహించారు. విశ్రాంత లీడర్ డా.అల్లంశెట్టి చంద్రశేఖరరావు, నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు తదితరులను ఇదే వేదికపై సత్కరించారు. విశ్రాంత ఎస్.బి.ఐ ఉద్యోగి వి.ఉదయభాస్కరరావు శ్రావ్యమైన గీతాలను పాడి అలరించారు. అలాగే కె.మాధవి, వి.నీరజ, వి.శ్యామల బృందగానం నిర్వహించారు.

పొందూరు : పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోటబొమ్మాళి: 2006లో స్థానిక విక్టరీ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకన్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను ఆహ్వానించి దుశ్శాలువలు కప్పి సన్మానించారు. ఒకరినొకరు నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ప్రస్తుతం ఎవరెవరు ఏయే స్థాయిలో ఉన్నారు చెప్పుకుంటూ పిల్లలు, వారి స్థితిగతులు చెప్పుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు తమను తీర్చిదిద్దబట్టే మేము ఒక్కొక్క స్థాయిలో ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో విక్టరీ విద్యా సంస్థల అధినేత హనుమంతు శ్రీనివాస్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రికార్డులను పరిశీలిస్తున్న శంకరరావు

గ్రంథాలయం సందర్శన

టెక్కలి: టెక్కలి గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి వి.వి.జి.శంకరరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ, సమస్యలపై గ్రంథాలయాధికారి బి.రూపావతిని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగులు చదువుకునేందుకు వీలుగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోటీతత్వ పరీక్షలకు సంబందించిన పుస్తకాలు వినియోగంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలు చెల్లించేందుకు కార్యదర్శులు సహకరించాలని కోరారు. నిధులు ఆటంకం లేకుండా చూడాలన్నారు. తనిఖీలో గ్రంథాలయ సహాయకులు అమ్మనమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నూతన కార్యవర్గానికి సన్మానం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండల టిడిపి నూతన కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శులు లోపింటు పద్మనాభం, దక్కత కామేశ్వరరావులు ఇటీవల ఎన్నికయ్యారు. మండలంలోని కీర్తిపురంలో టిడిపి నాయకులు గిన్ని బాలరాజు అధ్యక్షతన ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెదిన దుర్యోధనరెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శులు కరగాని కృష్ణ, క్షేత్రవాసి బెహరా, దున్న కుర్మారావు, కార్యదర్శి మెరుగు నారాయణ రెడ్డి, ఉగ్రపల్లి సత్యన్నారాయణ, ఆశి రామకృష్ణ, కోశాధికారి ఆశి మాధవరావురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

టెక్కలి: టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దృష్టా సోమవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గంట పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమయంలో ప్రయాణికులు, ప్రజలు, తమ సమస్యలు, సలహాలు, తెలియజేయవచ్చునని తెలిపారు. డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో భాగంగా 9959225611 నంబరును సంప్రదించాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సోంపేట : సోంపేట పట్టణంలో రోడ్డు భద్రతపై స్థానిక ఎస్ఐ లవరాజు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి స్థానిక గాంధీ మండపం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత చట్టాల గురించి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లవరాజు